## క్లుప్తంగా

### ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

**నారాయణఖేడ్:** పట్టణంతోపాటు మనూరు మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీఏ నూతన్‌కుమార్, ఏవోలు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లోని విత్తనాలస్టాక్, స్టాక్ రిజిస్టర్లు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, స్టాక్‌బోర్డులు, ఆయా కంపెనీల విత్తనాలు వివరాలు బిల్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల ఎదుట విత్తనాలు స్టాక్ బోర్డులు, ధరల పట్టికలను ప్రదర్శించాలని దుకాణాదారులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్లను మెయింటెన్ చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. అన్నిరకాల బీజీ–2 పత్తి విత్తనాలు ఒకటేనన్న విషయాన్ని రైతులు గమనించాలన్నారు. అన్నిరకాల బీజీ–2 పత్తివిత్తనాలు ఈ ప్రాంత భూములకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తరువాతే ఈ విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి

**రాయికోడ్(అందోల్):** సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. రాయికోడ్‌లోని పశు వైద్యశాలలో జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, జీవాల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాటువైద్యం జోలికి వెళ్లవద్దని, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మూగజీవాల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోషకులకు సూచించారు. పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు షెట్కార్ విజయోత్సవ ర్యాలీ

**నారాయణఖేడ్:** జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్ గెలుపొందడంపై నారాయణఖేడ్ పట్టణంలో ఈ నెల 7వ తేదీన విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11గంటలకు నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని భవానీమాత ఆలయం నుంచి ర్యాలీ కొనసాగుతుందన్నారు. ర్యాలీలో ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

### పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

**నారాయణఖేడ్:** మండల పరిధిలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాఠ్య, నోట్‌బుక్స్ పంపిణీని గురువారం ప్రారంభించారు. మండలానికి 30,466 నోట్‌బుక్స్, 35,446 పాఠ్యపుస్తకాలు రాగా వాటిని ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డంప్ చేశారు. వాటిని సీఆర్పీలు మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేస్తున్నారు. పాఠ్యపుస్తకాల అవసరాల్లో 90శాతం వరకు వచ్చాయని, పాఠశాలలు పున ప్రారంభమయ్యే లోపు మిగిలిన 10శాతం పుస్తకాలు వస్తాయని ఎంఈవో విశ్వనాథం తెలిపారు.

### రేణుకా ఎల్లమ్మ తల్లికి పూజలు



**పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రామలింగేశ్వర ఆలయంలో...**

పటాన్‌చెరు పాత టోల్ గేట్ సమీపంలోని రామలింగేశ్వర ఆలయంలో శనీశ్వర జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహేష్, గణేష్ మాట్లాడుతూ శనీశ్వరుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

# పత్తి సాగు ప్రారంభం

- ముందస్తు పనుల్లో నిమగ్నమైన రైతులు
- విత్తనాలు విత్తుతున్న కూలీలు
- కూలీల కొరత ఉంటుందని రైతుల తొందరపాటు
- ఆయా ప్రాంతాల్లో పూర్తికాని దుక్కులు



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

**ఝరాసంగం(జహీరాబాద్):** రైతులు పండించే వాణిజ్య పంటలో ముఖ్యమైన పంట పత్తి. పత్తి పంటను వర్షాకాలం ప్రారంభమైన తర్వాతే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. అయితే కూలీల కొరత ఉంటుందనే భావనలో రైతులు ముందస్తుగానే ఇప్పటికే మండల పరిధిలోని చాలా గ్రామాల్లో పత్తి విత్తనాలను విత్తడం ప్రారంభించారు. కాగా వేసవి దుక్కులు ఇంకా పూర్తి కాలేదు. అయినా రైతులు పత్తి పంట సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

– ఝరాసంగం(జహీరాబాద్)

**3లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు అంచనా**

వానాకాలం సీజన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు, అందులో 3లక్షలకు పైగా పత్తి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వేసవికాలంలో అకాల వర్షాలు కురవడంతో వానాకాలం ముందుగానే పత్తి విత్తనాలు విత్తుతున్నారు. 60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తర్వాతే భూమిలో సరైన తేమ శాతం వస్తుందని, అప్పుడే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా భూమిలో వేడి శాతం కూడా ఉండటంతో వేసిన విత్తనాలకు మొలక సరిగా రాకపోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అయినా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. కొంతమంది రైతులు వర్షాలను బట్టి ఆ తర్వాతే విత్తనాలు విత్తుతామని చెబుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిస్తే అందరూ ఒకేసారి విత్తనాలు వేసే తరుణంలో కూలీల కొరత ఉంటుందని భావనతో ముందుగానే పత్తి విత్తనాలు వేస్తున్నామని మరికొంతమంది రైతులు చెబుతున్నారు. సమయానికి వర్షాలు కురువకపోయినా స్ప్రింక్లర్లు, డ్రిప్ సహాయంతో పంటను కాపాడుకుంటామని రైతులు తెలుపుతున్నారు.

**ఇంకా పూర్తికాని దుక్కులు**

గ్రామాల్లో ఇంకా చాలాచోట్ల వేసవి దుక్కులు పూర్తి కాలేదు. నీటి సదుపాయం ఉన్న రైతులు వేసవిలో జొన్న పంటను సాగు చేశారు. ఇటీవల జొన్న పంట పూర్తి కావడంతో వారు ఇంకా దుక్కులు దున్ని పత్తి సాగుగు సిద్ధం కావాల్సి ఉంది.

**పంటను కాపాడుకుంటాం**



రెండు ఎకరాల్లో పత్తి విత్తనాలను వేశాం. ఒకవేళ వర్షాలు సరిగా కురువకపోయినా స్ప్రింక్లర్లు, డ్రిప్ సహాయంతో పంటను కాపాడుకుంటాం. పంట తొందరగా చేతికి వస్తుందని ఉద్దేశంతో ముందస్తుగానే పత్తి పంట సాగు చేస్తున్నాం.

– యూసుఫ్, రైతు, కక్కర్‌వాడ

**దుక్కులు సిద్ధం చేశాం**



కొన్నేండ్లుగా పత్తి పంటను సాగు చేస్తున్నాను. భూమిలో పూర్తిగా తేమ శాతం వచ్చాకే వర్షాలు కురుస్తున్న సమయంలో పత్తి విత్తనాలు వేసుకుంటాం. విత్తనాలు వేసుకునేందుకు దుక్కులు దున్ని భూమిని సిద్ధంగా ఉంచాం.

– వినోద్‌సింగ్, రైతు, ఝరాసంగం

**రైతులు తొందర పడొద్దు**



విత్తనాలు వేసుకునేందుకు రైతులు తొందర పడొద్దు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసుకునేందుకు అనువు కాదు. మరో రెండు వర్షాలు కురిసిన తర్వాత భూమిలో తేమ శాతం వస్తుంది. అ తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలి.

– వెంకటేశ్వర్, ఏఓ, ఝరాసంగం

## బీఆర్ఎస్ ఎత్తుగడతోనే బీజేపీ విజయం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** బీఆర్ఎస్ లోపాయికారి ఎత్తుగడతో బీజేపీ విజయం సాధించిందని, నైతికంగా కాంగ్రెస్ అభ్యర్థిదే విజయమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ నల్లచట్టాలను తీసుకురావడంతో బీజేపీకి చెందిన 17మంది మంత్రులు ఓటమి పాలయ్యారన్నారు. ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్యే ఎన్నికల్లో పటాన్‌చెరు 113వ డివిజన్‌లో కాంగ్రెస్‌కు 7600 ఓట్లు వస్తే, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో 11,855 వచ్చాయన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికలతో పోలిస్తే 4500 అధికంగా వచ్చాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఆరు గ్యారంటీల అమలుపై ఓటర్లు మంచి తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలో గతంలో కన్నా మెరుగైన ఓట్లు రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ దన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా పాషా, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, కుంచల కిషన్, రవి ముదిరాజ్, సాయి ముదిరాజ్ పాల్గొన్నారు.

### సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

**జిన్నారం(పటాన్‌చెరు):** మండల పరిధిలోని శివానగర్ గ్రామంలో ఉన్న ఎల్ఈడీ పార్కులో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులను విద్యుత్‌శాఖ రూరల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల తీరును సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈ భాస్కర్, ఏడీ శ్రీకాంత్, ఏఈ రాజు, సిబ్బంది ఉన్నారు.

### ఓటర్లకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

**జిన్నారం(పటాన్‌చెరు):** ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నేత రఘునందన్‌రావుకు ఓటు వేసిన ఓటర్లందరికీ గుమ్మడిదల మండల బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మడిదల గ్రామంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ బీజేపీ ఎంపీగా రఘునందన్‌రావును గెలిపించేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గుమ్మడిదల మండల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించేవిధంగా తమవంతు కృషి చేస్తామని వివరించారు. సమావేశంలో నాయకులు ఐలేష్, భాస్కర్‌గౌడ్, రాజిరెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

**కొండాపూర్(సంగారెడ్డి):** నకిలీ విత్తనాలు అమ్మితే చర్యల తప్పవని తహసీల్దార్ అనిత హెచ్చరించారు. కొండాపూర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలతో పాటు స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### బొల్లారం మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు పెరిగిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బొల్లారం మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీల కన్నా కాంగ్రెస్‌కు ఓట్లు అధికంగా వచ్చాయన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అన్నివర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి హోమం




హోమం నిర్వహిస్తున్న భక్తులు

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి నెల స్వామివారి సన్నిధిలో పూర్ణాహుతి హోమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, నిర్వహకులు సోమయ్య పాల్గొన్నారు.

### ఘనంగా శనైశ్చరుడి జయంతి

**జహీరాబాద్ టౌన్:** తెలంగాణ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పట్టణంలోని సిద్ధేశ్వరస్వామి ప్రాంగణంలో శనైశ్చరుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పూజారి సంగమేశ్వర స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, కాలభైరవ స్వామికి అభిషేకం, తెలాభిషేకం, శని మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న దత్తురెడ్డి

**సంగారెడ్డి టౌన్:** ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతులులేని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ బోర్డ్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని తెలిపారు.

## ప్రారంభోత్సవానికి సిద్ధం



తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** జిల్లాలో ఎక్కడాలేని విధంగా నిర్మించిన తెల్లాపూర్ మున్సిపల్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సుమారు రూ.8, 40కోట్ల నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. భవనం ముందు జాతీయజెండా కోసం 30మీటర్ల జెండా స్తంభాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఛాంబర్‌తో పాటు వివిధ శాఖల కోసం 25 గదులను ప్రత్యేకంగా నిర్మించారు. ఈ కార్యాలయాన్ని గతేడాదిలోనే పూర్తి చేయగా ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం, తరువాత కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఆతర్వాత మళ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో భవన ప్రారంభోత్సవం వాయిదా పడింది. ప్రస్తుతం ఎన్నికలు పూర్తి కావడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

## సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య




జహీరాబాద్ టౌన్: తూంకుంట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- ఎంఈఓ పీపీ రాథోడ్
- ఊరూరా బడిబాట ప్రారంభం



పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్

**పటాన్‌చెరు టౌన్:** సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. జూన్ 6వ తేదీ నుంచి 19వ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బడి మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు హెచ్‌ఎం ఉపాధ్యాయులతో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



జోగిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఊరూరా బడిబాట కార్యక్రమం**

**జహీరాబాద్ టౌన్:** జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులతో కలిసి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ బడిలో నాణ్యమైన బోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, భోజనం అందుతుందని వివరించారు.

**జోగిపేట పట్టణంలో...**

**జోగిపేట(అందోల్):** జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడీడు పిల్లలందరిని సర్కార్ బడుల్లో చేర్పించేవిధంగా అందరూ చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజానాయక్, రమేష్, మౌలానా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



**సంగారెడ్డి:** నీట్ ఫలితాల్లో పుల్కల్ మండల పరిధిలోని మిన్పూర్ గ్రామానికి చెందిన పేద విద్యార్థి దేవుని ఆదిత్యయాదవ్ 720 మార్కులకు గాను 638 మార్కులు సాధించాడు. యాదాద్రి జిల్లా టీఎస్ రెసిడెన్షియల్ కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించడంపై ఆదిత్యయాదవ్‌ను పలువురు అభినందించారు.

**నీట్‌లో మెరిసిన సెయింట్ అంథోని కళాశాల విద్యార్థిని**



**సంగారెడ్డి:** నీట్ ఫలితాల్లో సెయింట్ అంథోని కళాశాల విద్యార్థిని అఫీపా పాతిమా 720 మార్కులకు గాను 426 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిరెడ్డి, డైరెక్టర్ సాల్మొహన్ రెడ్డి పాతిమాకు అభినందనలు తెలిపారు.

## బీడీఎల్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**పటాన్‌చెరు:** మండల పరిధిలోని భానూర్ గ్రామంలో ఉన్న బీడీఎల్ టౌన్ షిప్‌లో యశోద సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఫ్రీ కార్డియో చెకప్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీడీఎల్ భానూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషన్ ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు, పురుషులకు బీపీ, షుగర్, ఈసీ, 2డీసీఓ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బీడీఎల్ టీయూసీ– ఐఎన్‌టీయూసీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు అహిమదుల్లా కార్యవర్గం, యశోద కార్డియో డాక్టర్స్ బృందం, యశోద మార్కెటింగ్ జీఎం రమేష్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో 8వ వార్డులో గురువారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రధానంగా పార్కు చుట్టూ చెత్తాచెదారం వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వివరించారు. తాగునీరు వచ్చినప్పుడు రోడ్లపైకి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఆమె తెలిపారు.